క్లుప్తంగా

పారిశుధ్య పనులను పరిశీలించిన జెడ్సీ



బీఆర్టీఎస్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: పారిశుధ్య కార్మికుల ఒక రోజు సమ్మె కారణంగా జోన్–8 కమిషనర్ మల్లయ్య నాయుడు సోమవారం స్వయంగా పనులను పర్యవేక్షించారు. గోపాలపట్నం బీఆర్టీఎస్ రహదారిలో రహదారుల నిర్వహణను పరిశీలించారు. పర్మినెంట్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్లతో రహదారిలోని డంపర్ బిన్లను తొలగించేలా చర్యలు చేపట్టారు. అందుబాటులో ఉన్న పారిశుధ్య కార్మికులను ఉపయోగించుకుని రహదారులు శుభ్రం చేయించాలని సూచించారు. జోన్ పరిధిలో పలు వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు



శ్రీహరిపురం బస్టాప్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచె నిర్మాణ పనులు చేయిస్తున్న ఏఈ శ్రీనివాసరావు

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: ఈ నెల 5వ తేదీన 'సాక్షి' దినపత్రికలో ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లు అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. శ్రీహరిపురం సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాసరావు సిబ్బంది సాయంతో సోమవారం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె నిర్మాణ పనులు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అనాథ పిల్లలకు భోజనం వితరణ



పిల్లలకు భోజనం వడ్డిస్తున్న భాస్కరరావు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన సామాజికసేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో పావని ఇన్‌స్టిట్యూట్ ఫర్ మల్టీప్లే సంస్థ సహకారంతో అనాథ పిల్లలకు భోజనాలు పెట్టారు. స్థానిక ఆశ్రమంలో సోమవారం భోజనాలతో పాటు పుస్తకాలు పంపిణీ చేశారు.

14న సింహగిరిపై గోదాదేవి అలంకరణ పోటీలు

సింహాచలం: ఈనెల 14న భోగి పండగరోజు సింహగిరిపై స్వధర్మవాహిని సంస్థ ఆధ్వర్యంలో 5నుంచి 12 ఏళ్లలోపు బాలికలకు గోదాదేవి అలంకరణ, వస్త్రధారణ పోటీలు నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ తెలిపారు. సింహగిరిపై ఉన్న రాజగోపురం పక్కన ఉన్న సాంస్కృతిక కళావేదికపై ఆరోజు ఉదయం 9 నుంచి 10గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐదుగురు విజేతలకు రూ.1000 చొప్పున నగదు బహుమతి అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

కల్యాణం .. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు.

రోడ్డెక్కిన వ్యాపారాలు!

- పార్కింగ్ స్థలం లేక వినియోగదారుల అవస్థలు
- రోడ్డు స్థలాలు అద్దెకిస్తున్న దుకాణదారులు, భవన యజమానులు
- సెల్లార్లు ఉన్నా పార్కింగ్‌కు అనుమతి నిరాకరణ



పార్కింగ్ ప్రదేశం లేక రోడ్డుపై నిలిపిన కారు



ఫుట్‌పాత్‌పై స్టాల్ పెట్టిన ఓ షాపింగ్‌మాల్ యాజమాన్యం

గోపాలపట్నం: పండగ సందడి మొదలైంది... దీంతో పాటు వినియోగదారులకు ఇబ్బందులూ మొదలయ్యాయి. దుకాణ సముదాయాల వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకునే సదుపాయం లేక కార్లు, ద్విచక్రవాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌పాత్‌లను కూడా ఆక్రమించడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

దుకాణమున్నా ఫుట్‌పాత్‌పై స్టాళ్లు

పలువురు బడా వ్యాపారులు దుకాణాలు ఉన్నా.. ఫుట్‌పాత్‌లపై స్టాళ్లు పెట్టడం ఇబ్బందికరంగా మారిందని పాదచారులు వాపోతున్నారు. పలు దుకాణాల్లో సెల్లార్లు ఉన్నా వాటిలో వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు దుకాణదారులు అనుమతించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇంకొన్ని భవనాల్లో సెల్లార్లను వ్యాపారాలకు అద్దెకి ఇచ్చేశారు. దీంతో రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. రెండేసి వరుసల్లో వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పాడుతోందని వాపోతున్నారు.

అద్దెలకు రోడ్లు

రహదారులను కొందరు దుకాణదారులు అద్దెకి ఇచేస్తున్నారు. దుకాణాల ముందు వాటి పక్కన ఏర్పాటు చేసుకుని జీవనం చేస్తున్నవారిని దోచుకుంటున్నారు. దుకాణం ముందు ఉన్న రోడ్డుపై బండిపెట్టు కోవడానికి నెలకు రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు ఇవ్వాల్సి వస్తోందని వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

ప్లాన్‌లో సెల్లార్లుగా చూపించి ఆ తర్వాత దుకాణాలకు అద్దెకు ఇస్తున్నా అధికారులు అట్టువైపు చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గోపాలపట్నంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల సమన్వయంతో సెల్లార్లు వినియోగం అయ్యేలా చర్యలు తీసుకుంటాం. జోనల్ కమిషనర్‌లో కలసి ఈ విషయంపై స్వయంగా మాట్లాడి తగిన విధంగా చర్యలు తీసుకుంటాం.

– అశోక్ కుమార్, ట్రాఫిక్ సీఐ

నర్సులు సేవా భావంతో పనిచేయాలి

పెథాలజిస్టు కర్రి అరుణ



వైద్యురాలు అరుణను సత్కరిస్తున్న చైతన్య

గోపాలపట్నం: నర్సులు సేవా భావం కలిగి ఉండాలని పెథాలజిస్టు డాక్టర్ కర్రి అరుణ అన్నారు. నరవ బెహరా నర్సింగ్ కళాశాలలో సోమవారం ఇండక్షన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యాధిగ్రస్తుడికి.. వైద్యునికి సహకారిగా వ్యవహరించే కీలకమైన ఉద్యోగం నర్సింగ్ అని అన్నారు. వైద్యుడి సలహా మేరకు వ్యాధిగ్రస్తుడికి సేవలు అందించాలని సూచించారు. బెహరా కళాశాలల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య మాట్లాడుతూ చదువుతో పాటు ఆస్పత్రిలో తగిన శిక్షణ పొందడం అవసరమన్నారు. ఈ సందర్భంగా వైద్యురాలు కర్రి అరుణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు ప్రియ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం .. కమనీయం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆత్మీయ కలయిక.. అపూర్వ వేడుక



ఆత్మీయ కలయికలో పూర్వవిద్యార్థులు

మల్కాపురం: విశాఖపట్నం ప్రభుత్వ క్వీన్ మేరీ ఉన్నత పాఠశాలలో 70 ఏళ్ల కిందట ఇంటర్ చదువుకున్న వారంతా ఒక వేదికపై కలుసుకున్నారు. నాటి విశేషాలను గుర్తు చేసుకున్నారు. తరగతి గదుల్లో చేసిన అల్లరి, చదువులో పోటీ పడే అంశాలు, ప్రస్తుతం వారి వారి కుటుంబ విశేషాలపై మాట్లాడుకున్నారు. స్థానికంగా ఉన్న ప్రైవేట్ హాల్ ఈ వేడుకకు వేదికైంది. సోమవారం కలుసుకున్న వీరు ఆత్మీయంగా పలకరించుకున్నారు.1968లో 12వ తరగతి (ఇంటర్) వరకు చదువుకున్న నాటి మిత్రులు సుమారు 20 మంది వరకు కలుసుకున్నారు.వీరిలో చాలా మంది వైద్యులుగా,ప్రధానోపాధ్యాయులుగా, వివిధ ఉన్నత హోదాల్లో పని చేసిన వారు ఉన్నారు. ఏటా డిసెంబర్ లేదా జనవరి నెలలో కలుస్తామని వారు చెప్పారు.

అంగన్‌వాడీ అభ్యర్థులకు మౌఖిక పరీక్ష రేపు



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

మద్రిపాలెం: అంగన్‌వాడీ కేంద్రం ఉద్యోగాలకు సంబంధించి ఈ నెల 11న కలెక్టర్ కార్యాలయంలోని ఆర్డీవో ఆఫీస్‌లో మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్టు అర్బన్–1 సీడీపీవో ఎం.వి.రమణికుమారి తెలిపారు. మౌఖిక పరీక్షలకు ఎంపికైన అభ్యర్థులకు సోమవారం ఇంటర్వ్యూ ధ్రువపత్రాలను అందజేశారు. అర్బన్–1 పరిధిలో మొత్తం ఖాళీలు 20 ఆయా పోస్టులకు సంబంధించి 58 మంది మౌఖిక పరీక్షకు ఎంపికయ్యారన్నారు. 100 మార్కులకు పరీక్ష ఉంటుందని, ఆరోజు ఉదయం 9.30 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలు తెలియజేస్తున్న సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రమేష్

సింహాచలం: ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. పండగ రద్దీ నేపథ్యంలో కూడళ్లతో పాటు వాణిజ్య కూడళ్లలో వాహనదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. 94వవార్డు పరిధి వేపగుంట నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు మైక్‌ల ద్వారా ట్రాఫిక్ రూల్స్‌ని వివరించే విధానానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రమేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మైకుల ద్వారా ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలను తెలియజేశారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వివరించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేనిదే ప్రయాణించవద్దన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడపడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. అలాగే పాదచారులు రోడ్డు క్రాస్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు

ముమ్మరంగా ఎఫ్‌బీఎస్ ఎన్నికల ప్రచారం



భెల్ ప్రధాన గేటు వద్ద ప్రచారం చేస్తున్న ఇంటక్, సిటూ అభ్యర్థులు

అక్కిరెడ్డిపాలెం: భెల్‌లో ఈ నెల 11న జరగనున్న ఫ్యామిలీ బెనిఫిట్ సొసైటీ (ఎఫ్‌బీఎస్) ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ అభ్యర్థులు ఎస్.అప్పారావు, జి.దేముడు విజయాన్ని ఆకాంక్షిస్తూ సంస్థ ప్రధాన గేటు వద్ద ప్రచారాలు చేపట్టారు. ఇరు యూనియన్లకు చెందిన ఉరుకూటి బాబూరావు, జి.టి.పి.ప్రకాష్, విజయ్ కుమార్, వి.ఆనందరావు, ఎస్.జగన్నాధరావు, సీతంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఉక్కు ప్రైవేటీకరణకు స్వస్తి పలికే వరకు ఉద్యమం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి స్వస్తి పలికే వరకు తమ ఉద్యమాలు కొనసాగుతాయిని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన ఉక్కు రిలే నిరాహారదీక్షలో 697వ రోజు, సోమవారం కోక్ ఓవెన్ డిపార్ట్‌మెంట్ కార్మికులు కూర్చొన్నారు. గుంటూరు జిల్లాకు చెందిన శ్రీజయ ఆంధ్రశ్రీమహాదేవ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, ఎస్.రామచంద్రరావు, జె.రామకృష్ణ, యు.రామస్వామి, వి.శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహనకుమార్, డి.వి. రమణారెడ్డి, సీహెచ్.సన్యాసిరావు, కె.పరంధామయ్య, డి.శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర తదితరులు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక, ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంటును నష్టాల ఊబిలోకి నెట్టే ప్రయత్నం యాజమాన్యం చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని హితవు పలికారు. ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక సెగ తగిలేలా ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జన యాత్రలో కార్మికులంతా కటుంబసభ్యులతో సహా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.బాబూరావు, తాండ్ర కనకరాజు, సుబ్బారావు, ఎల్లారావు, కె.ఆనంద్‌కుమార్, టి.వి.కె. రాజు, పల్లా పెంటారావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

16న బౌద్ధ మేళా



బౌద్ధ మేళా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అనకాపల్లిలోని బుద్ధుని కొండపై ఈ నెల 16న నిర్వహించనున్న బౌద్ధ మేళాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లా మహాబోధి సొసైటీ అధ్యక్షుడు గుణుపూడి బాబు మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం బౌద్ధ పతాకావిష్కరణ ఉంటుందని తెలిపారు. కొండ ప్రవేశ ద్వారం నుంచి పంచశీల శాంతి యాత్రను నిర్వహించనున్నామని చెప్పారు. మయన్మార్ బౌద్ధ బిక్షువు వెనరబుల్ ఆయుపాల మహాథేరో, శ్రీలంక దేశ తెలుగు బౌద్ధ బిక్షువు వెనరబుల్ బోధీహీన్ బంతేజీ హాజరై దమ్మ సందేశం వినిపిస్తారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మార్టుపూడి పరదేశి, ధర్మాల శ్రీను, గొందేశి వెంకటరమణారెడ్డి, బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి బోధనలు అనుసరణీయం

మురళీనగర్: విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని యువతకు రామకృష్ణ మిషన్ ఆశ్రమ స్వామి గీతాసరానంద సూచించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సోమవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం పట్ల భక్తి, అనురక్తి కలిగి ఉన్నప్పుడే మన దేశం మరింత శక్తిమంతంగా మారుతుందన్నారు. వివేకానందుడి బోధనలు విశ్వం ఉన్నంత కాలం అనుసరణీయాలని వివరించారు. నేటి యువత బాహుబలంతోపాటు బుద్ధి బలం, ఆత్మబలం కలిగి ఉండాలన్నారు. త్యాగం, మానవ సేవ వంటి ఉత్తమ లక్షణాలను విద్యార్థులు అలవరుచుకోవాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించి పోటీల్లో విజేతలకు స్వామి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ జీఈ రాజు, కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ జి.వి.లక్ష్మణరావు, పెట్రో కెమికల్స్ విభాగం హెడ్ సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, బి.రామాజంనేయులు, బి.హెచ్.ప్రదీప్‌కుమార్, డి.దామోదర్, ఎస్.పి.కుమారి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లు



తన ఇంటి వద్ద కేక్ కట్ చేస్తున్న బెహరా భాస్కరరావు



52వ వార్డులో కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



61వ వార్డులో కేక్ తినిపిస్తున్న బద్రీనాథ్, పీవీ సురేష్ తదితరులు

గోపాలపట్నం: ప్రజలు తమ సంకల్పాన్ని నెరవేర్చుకున్నారు. సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. నాడు ప్రతిపక్ష నేత హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ముగిసిన రోజును ఘనంగా నిర్వహించారు. 52వ వార్డులోని తన నివాసంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కేక్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వెదుళ్ల శ్రీనివాసరావు, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 91, 92వ వార్డు కార్యకర్తలతో కలసి జీవీసీసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆయన ఇంటి వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, నాయకులు కంపర సత్తిబాబు, గొంతిన నాగరాజు, లోకేష్ రెడ్డి, దేరెడ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.
- 90వ వార్డు పార్టీ కార్యాలయం వద్ద వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి కేక్ కత్తరించి కార్యకర్తలకు అందించారు. కార్యక్రమంలో యల్లపు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంకల్పం ఉన్న మనిషి జగన్

మల్కాపురం: తన ప్రజా సంకల్పయాత్ర ద్వారా టీడీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు పడిన కష్టాలను స్వయంగా తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వారికి అండగా నిలిచారని ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్,కార్పొరేటర్లు పి.వి.సురేష్, కొణతాల సుధ అన్నారు. 61వ వార్డు ఆర్‌కేపురంలోని పార్టీ నాయకుడు దాడి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం వీరు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు,63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- 58వ వార్డులో కార్పొరేటర్ గులిగిందల లావణ్య కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. కృష్ణ,పాడుగు రాజు తదితరులు ఎల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 63వ వార్డులోని పలు ప్రాంతాల్లో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ సోమాదుల సురేష్, నాయకులు కేబుల్‌రాజు, బొడ్డు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణాలు!



ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న చిన్నారులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో పలువురు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పరిమితికి మించి ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. సోమవారం మల్కాపురం నుంచి శ్రీహరిపురం వైపు వెళ్తున్న జీప్ వెనుక పరిమితికి మించి కూలీలను ఎక్కించారు. అలాగే మల్కాపురం నుంచి డాక్‌యార్డ్ వైపు వెళ్తున్న ఆటోలో డ్రైవర్ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించాడు. ఈ ఆటోలో కూర్చున్న చిన్నారులు వెనుక వేలాడుతున్న ఆటో డ్రైవర్ తనకు ఏమీ సంబంధం లేదు అన్నట్టు వ్యవహరించాడు. పొరపాటున ఏదైనా ఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

జోన్–5 ఏసీపీ బాధ్యతల స్వీకరణ



ఏసీపీ రమణమూర్తి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా ఐ.వి.రమణ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఉత్తర్వుల మేరకు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు జోన్–5లో పనిచేసిన ఏసీపీ ఎం.అరుణవల్లి గాజువాక జోన్ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రమణమూర్తిని జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అభినందించారు. కొత్త ఏసీపీ మాట్లాడుతూ జోన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై దృష్టి సారించాలని టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. జీవీఎంసీ 40వ వార్డు నుంచి 63 వార్డులకు సంబంధించి అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే వారు జీవీఎంసీ ప్లాన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని జోన్ ప్రజలకు ఆయన సూచించారు.

24 గంటల దీక్ష విరమణ



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి, దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: ఉక్కు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నడుపూరు గ్రామస్తుల ఆధ్వర్యంలో గాంధీపార్కు ఎదుట చేపట్టిన 24 గంటల నిరాహారదీక్ష సోమవారం ముగిసింది. దీక్షలో కూర్చున్న మంత్రి గోపి, జగదీష్, ప్రసాద్, పి.గోపి, గోవింద్, రాంబాబు, అప్పలరాజు, శ్రీను, భానుకిరణ్ తదితరులకు మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయకుండా అడ్డుకునేందుకు ఎన్ని పోరాటాలైనా చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్స్‌కు జ్యోతి



విశాఖ స్పోర్ట్స్: ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నగర అథ్లెట్ వై.జ్యోతి పాల్గొనుంది. ఇందులో పాల్గొనేందుకు భారత్ తరఫున 13 మంది చొప్పున వుమెన్, మెన్‌ను భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఎంపిక చేసింది. వంద మీటర్ల పరుగులో జాతీయ రికార్డు నెలకొల్పిన విశాఖ అథ్లెట్ జ్యోతి జట్టుకు ఎంపికైంది. కజకిస్తాన్‌లో జరగనున్న ఈ పోటీల్లో 60 మీటర్ల స్ప్రింట్‌తో పాటు 60 మీటర్ల హార్డిల్స్‌లో జ్యోతి పాల్గొనుంది.